క్లుప్తంగా

నేడు ప్రధాని 'మన్ కీబాత్'



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని పదవి చేపట్టిన తర్వాత మొదటి ఎపిసోడ్ మన్ కీ బాత్ కార్యక్రమం ఆదివారం ఉదయం 11 గంటలకు ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డి తెలిపారు. అన్ని బూతులలో ఎల్ఈడీ టీవీలు ఏర్పాటు చేసుకుని కార్యక్రమన్ని వీక్షించాలని సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా పదాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామప్రసాద్ ముఖర్జీ బలిదాన వారోత్సవ కార్యక్రమాలకు సంబంధించిన భవిష్యత్తు కార్యక్రమాలను రూపొందించారు.

అమ్మవారికి పూజలు

బాసర: బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ శోభా సత్యనారాయణగౌడ్ శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మనుమడు హరీశ్‌గౌడ్‌కు అక్షరశ్రీకారం పూజ చేయించారు. పూజల అనంతరం అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

కుభీర్: పారిశుధ్యంపై దృష్టిసారించాలని ఎంపీడీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని తెలిపారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీరోజు క్లోరినేషన్ చేయాలని గ్రామాల్లో నీటి ట్యాంకులను పదిరోజులకోసారి శుభ్రం చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పద్మ, ఎంపీవో గోవర్ధన్ పాల్గొన్నారు.


ఎస్సారెస్పీ భూములు ఆక్రమిస్తే చర్యలు



కంచె తీయిస్తున్న ఎస్సారెస్పీ ఏఈఈ రవి

లోకేశ్వరం: ఎస్సారెస్పీ ముంపునకు గురైన భూములు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఏఈఈ రవి పేర్కొన్నారు. మండలంలోని గడ్చాంద గ్రామంలోని ఎస్సారెస్పీ ముంపునకు గురైన భూములను శనివారం పరిశీలించారు. ఓ రైతు ఎస్సారెస్పీ భూముల్లో ఏర్పాటు చేసిన కంచెను అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా ఏఈఈ రవి మాట్లాడుతూ ఎస్సారెస్పీ భూముల్లో ఎలాంటి సాగు చేయొద్దన్నారు. భూములు అక్రమణకు గురైతే సర్వే ద్వారా తొలగిస్తామన్నారు. ఆర్ఐ బాలకృష్ణ, సర్వేయర్ నరేందర్ ఉన్నారు.

భగీరథ నీరు వృథా



నర్సాపూర్(జి): స్థానిక పశువైద్యశాల పక్కన గల మిషన్ భగీరథ ట్యాంక్ పైప్‌లైన్ వద్ద లీకేజీ ఏర్పడింది. కొన్ని రోజులుగా రోడ్డుపై నీరు వృథాగా చేరుతోంది. పైప్‌లైన్‌కు మరమ్మతు చేపట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నోట్‌బుక్స్ పట్టివేత

ఖానాపూర్: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, దుస్తులు తదితర సామగ్రిని ఏబీవీపీ నాయకులు శనివారం పట్టుకున్నారు. సంబంధిత విద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎంఈవో మధుసూదన్ ఆదేశాలతో కేరళ మోడల్, గౌతమ్ మోడల్ స్కూళ్లలో పట్టుబడ్డ సామగ్రిని సీఆర్పీ సంతోశ్, సిబ్బంది శేఖర్ సీజ్ చేశారు. ఏబీవీపీ ఇందూర్ విభాగ్ ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివ, నాయకులు లక్ష్మణ్, భూమేశ్, సన్నీ, తరుణ్, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

పుట్టగొడుగుల్లా వెంచర్లు

- అనుమతి లేకుండానే లేఅవుట్లు, ప్లాట్ల విక్రయాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- కొనుగోలు చేశాక రిజిస్ట్రేషన్ కాని వైనం
- ఆందోళనలో ప్రజలు



జామ్ గ్రామం ఇందిరమ్మ కాలనీలో వెలిసిన అనుమతి లేని వెంచర్

సారంగాపూర్: పచ్చని పంటపొలాలు ప్లాట్లుగా మారుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా వెంచర్లు వెలుస్తున్నాయి. ఇలా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఏకంగా నాలాలు పూడ్చివేసి మరీ వెంచర్లు వేస్తున్నారు. అయినా అప్పుడప్పుడు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు హడావుడిగా వెళ్లి హద్దురాళ్లు తొలగిస్తున్నారనే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రియల్టర్లు రెచ్చిపోతున్నారు. మండలంలోని జామ్ గ్రామంలో నెల రోజుల వ్యవధిలో రెండు వెంచర్లు పుట్టుకొచ్చాయి. అడెల్లి సమీపంలో మరోటి ఇలా మండలంలో దాదాపు 20 వరకు అక్రమ వెంచర్లు దర్శనమిస్తున్నాయి.

నిబంధనలు ఇలా..

వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి విక్రయించాలంటే తొలుత ప్లాట్లుగా మార్చిన భూమిలోంచి 10 శాతం పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలి. ఆ తర్వాత నాలా కన్వర్షన్ ద్వారా ఆర్డీవో నుంచి ఉత్తర్వులు పొంది అనంతరం డైరెక్టరేట్ ఆఫ్ టౌన్‌ప్లానింగ్, కంట్రీ ప్లానింగ్ నుంచి అనుమతులు పొందాలి. డీటీసీపీ అనుమతి కోసం నీటిపారుదల, రెవెన్యూ శాఖల నుంచి ధ్రువీకరణ పత్రాలు జతచేయాల్సి ఉంటుంది. వెంచర్ అప్రోచ్ రోడ్డు 60 ఫీట్లు, లోపల 40 ఫీట్లు రోడ్డు, 33 ఫీట్ల వెడల్పు రోడ్డు ఏర్పాటు చేయాలి. కానీ ఇప్పటివరకు వెంచర్లలో ఎలాంటి నిబంధనలు పాటించలేదు. రాజకీయ నాయకుల అండదండలతో అమాయక రైతులకు డబ్బులు ఎరచూపి పచ్చని పొలాలను ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. కొందరు రియల్టర్లు ప్లాట్ల రిజిస్ట్రేషన్ క్రమంలో తీసుకున్న ఖరీదు డబ్బులు కాకుండా అదనంగా ప్లాట్లు కొనుగోలు చేసినవారి నుంచి వసూళ్లు చేసి నాలా కన్వర్షన్ పేరిట దోపిడీకి తెరలేపారు. లేదంటే మీ ఇష్టం మీరే చేయించుకోండని వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.



అడెల్లి సమీపంలో నాలాను మూసివేసి మరీ వేసిన వెంచర్

లబోదిబోమంటున్న అమాయక ప్రజలు

ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందన్న ఆశతో నిరుపేదలు అప్పు చేసి ప్లాట్లను కొనుగోలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకునే క్రమంలో రియల్టర్లు వ్యవసాయ భూమిగా చూపించి ప్రక్రియ పూర్తిచేసి ఇస్తున్నారు. ఇంటి నిర్మాణ కోసం పంచాయతీ అనుమతికి దరఖాస్తు చేసుకుంటే నాలా కన్వర్షన్ ఉంటేనే అనుమతి వస్తుందనడంతో ప్రజలు లబోదిబోమంటున్నారు. ఇలా ఇప్పటికే పంచాయతీ అనుమతి లేకుండానే ఇళ్ల నిర్మాణాలు జరిగిన దాఖలాలున్నాయి. ముఖ్యంగా జామ్, సారంగాపూర్, బీరవెల్లి, అడెల్లి, తదితర గ్రామాల్లో ఈ తరహా నిర్మాణాలు జరిగాయి. ఇదంతా బాహాటంగానే జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇకనైనా స్పందించి రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నోటీసులు ఇచ్చాం

అనుమతి లేకుండా వేసిన వెంచర్ల యజమానులకు ఇదివరకే నోటీసులు ఇచ్చాం. చించోలి(బి) సమీపంలో ఒకటి, బీరవెల్లిలో ఒకటి, సారంగాపూర్‌లో మరో వెంచర్లకు డీటీసీపీ అనుమతులు ఉన్నాయి. మిగతా వాటికి లేవు. గతంలో హద్దురాళ్లు తొలగించాం. అనుమతులు తీసుకోకపోవడంతో నోటీసులు అందించాం.

– తిరుపతిరెడ్డి, ఎంపీవో

సంక్షిప్తంగా

రేపు మండల సమావేశం

మామడ: మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుశీల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రాథోడ్ అమృత అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు పే ర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని సూచించారు.

బ్యాగ్‌లు, నోట్‌బుక్‌ల పంపిణీ

కుంటాల: మండలంలోని అందకూర్‌కు చెందిన ముద్దం మౌనిక–పురుషోత్తం దంపతుల కుమారుడు సుశాంత్ ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం సుశాంత్ జయంతి సందర్భంగా కుటుంబీకులు పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, నోటుబుక్‌లు, పెన్నులు, పలకలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం సిద్ధిరాం, ఎంపీటీసీ మధుకర్, మాజీ సర్పంచులు దాసరి కిషన్, సాగర్‌రావు, మాజీ ఎంపీటీసీ కన్నం లక్ష్మణ్, ఉపాధ్యాయులు గంగాధర్, రేవతి, పంచాయతీ కార్యదర్శి రమ్య, వీడీసీ చైర్మన్ మహేశ్వర్‌రావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి, ట్రాన్స్‌జెండర్ సిరి, ముద్దం భోజన్న, శంకర్ పాల్గొన్నారు.

రేపు రైతులతో సమావేశం

మామడ: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు హరీశ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో రైతుభరోసా పథకం అమలు కోసం అన్నదాతల నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. వ్యవసాయ, జిల్లా సహకారశాఖ అధికారులు హాజరవుతారని తెలిపారు.

నోటుపుస్తకాలు, పెన్నుల పంపిణీ

సారంగాపూర్: మండలంలోని యాకర్‌పెల్లికి చెందిన మేకల చంద్రశేఖర్ తన భార్య లావణ్య జ్ఞాపకార్థం శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. స్థానికులు సాయన్న, చిన్నయ్య, సాయేందర్, చిదుగు రాజేశ్వర్‌రెడ్డి, భూమేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాలలో యోగా శిక్షణ

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ ఉన్నత పాఠశాలలో ప్రతీ శనివారం యోగాలో గురువు నవీన్ కుమార్ శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఎంఈవో చంద్రకాంత్, ఉపాధ్యాయులు దేవేందర్, మల్కాగౌడ్ ఉన్నారు.

పరామర్శ

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సమ్మెట రవి తండ్రి చిన్నయ్య అనారోగ్యంతో నిర్మల్‌లోని ఆదిత్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు శనివారం చిన్నయ్యను పరామర్శించారు. ఆయన వెంట రాజేశ్వర్ ఉన్నారు.

వైభవంగా పల్లకిసేవ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవరకోట ఆలయంలో స్వామివారి పల్లకి సేవను శనివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ శ్రీధర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఎల్లో కలర్ డే

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ విద్యానికేతన్ పాఠశాలలో ఎల్లో కలర్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. పసుపు రంగు దుస్తుల్లో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

ఈరోజు

రైతులతో సమావేశం

తానూరు: స్థానిక రైతువేదిక కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ సీఈవో భూమయ్య తెలిపారు. రైతు భరోసా పథకంపై వారి అభిప్రాయాలు, సలహాలు స్వీకరిస్తామన్నారు.

విద్యుత్ అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: 220/132/33 కేవీ నిర్మల్ సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం కలుగుతుందని ఏడీఈ రవి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. 132 కేవీ ఖానాపూర్, బూరుగుపల్లి, పోచంపాడు, సారంగాపూర్ ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు.

పీఏసీఎస్‌లో సమావేశం

ముధోల్: బిద్రెల్లి పీఏసీఎస్ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు జరిగే సమావేశానికి సభ్యులు హాజరుకావాలని కోరారు.

డీఎస్‌కు 'అల్లోల' నివాళి

నిర్మల్‌టౌన్: కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) మృతిపట్ల మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో పార్థివదేహం వద్ద పూలమాలవేసి నివాళులర్పించారు. పీసీసీ అధ్యక్షుడిగా, మంత్రిగా పనిచేశారు. సుదీర్ఘకాలం ప్రజలకు సేవలందించారని కొనియాడారు. డీఎస్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

రమేశ్ రాథోడ్ మృతిపై సంతాపం

మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ మృతిపట్ల మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సంతాపం వ్యక్తంచేశారు. అట్టడుగు స్థాయి నుంచి రాజకీయ నాయకుడిగా ఎదిగారని పేర్కొన్నారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



డీఎస్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

డీఎస్ మృతి తీరనిలోటు

లక్ష్మణచాంద: డీఎస్ మృతి తీరని లోటని జెడ్పీటీసీ సభ్యుడు రాజేశ్వర్ అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా, మంత్రిగా, ఎంపీగా, రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. ప్రజాసేవలో సుదీర్ఘ కాలం ఉండి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. లక్ష్మణచాంద మున్నూరు కాపు సంఘం తరపున తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉద్యోగ విరమణ సహజం

ఖానాపూర్: ప్రతీ ఉద్యోగి, ఉపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ సహజమని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణరావు అన్నారు. మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఇర్రి నరేందర్‌రెడ్డి పదవీ విరమణ పొందిన సందర్భంగా శనివారం అయన్ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. వివిధ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు లక్ష్మణ్, డి.శంకర్, పి.అశోక్, సీహెచ్ శ్రీనివాస్, నరేందర్‌రావు, జాడి శ్రీనివాస్, శేఖర్, అంజయ్య, తదితరులు ఉన్నారు.

లోకేశ్వరంలో..

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ పాఠశాల హెచ్‌ఎం నాగేశ్ ఆదివారం పదవీ విరమణ సందర్భంగా అయన్ను సన్మానించారు. ఎంఈవో చంద్రకాంత్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సురేశ్‌రావు, ప్రధాన కార్యదర్శి అధ్యక్షుడు రాజారాంలు నాగేశ్ దంపతులకు శనివారం శాలువా కప్పి సత్కరించారు. పీఆర్టీయూ మండల నాయకులు రాజేందర్, రవీందర్, ఎల్లన్న తదితరులు ఉన్నారు.



ఖానాపూర్: హెచ్‌ఎం దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆయిల్‌పామ్ తోటల పరిశీలన

దస్తురాబాద్: మండలంలోని గోడిసీర్యాల, రాంపూర్ గ్రామాల్లో సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను, బిందు సేద్యం పరికరాలను అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ శనివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుచేయాలనుకునేవారికి ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందించడంతోపాటు ప్రోత్సాహకాలు అందిస్తుందని వివరించారు. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యానవన అధికారిని సంప్రదించాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్‌వెంట జిల్లా ఉద్యవన, పట్టు పరిశ్రమ అధికారి ఆలియా ఫాతిమా, మండల అధికారి మౌనిక, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో అనిల్, ఫ్రీయూనిక్ జిల్లా మేనేజర్ మల్లేశ్వర్‌రావు, మనోజ్, నవీన్, దినేశ్ తదితరులు ఉన్నారు.



రాంపూర్‌లో పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

'సీడీపీవోను తొలగించాలి'

పెంబి: ఆదివాసీ అంగన్‌వాడీ టీచర్‌పై లేనిపోని సంబంధాలు అంటగడుతున్న ఖానాపూర్ ఐసీడీఎస్‌లో విధుల నిర్వహిస్తున్న సీడీపీవో సరితను తొలగించాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. టీచర్ల నుంచి అక్రమంగా వసూళ్లు చేయడమే కాకుండా ఎందుకని ప్రశ్నించినందుకు అక్రమ సంబంధాలు అంటగడుతుందని పేర్కొన్నారు. సీడీపీవోతోపాటు డబ్బులు వసూళ్లకు పాల్పడినవారిని విధుల నుంచి తొలగించాలని లేకపోతే ఆదివాసీ జిల్లా నాయకులతో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఆదివాసీ నాయకులు మాడవి సుంగు పటేల్, అంకుష్ రావ్ పటేల్, సూర్యభాను, మధు, మారుతీ పటేల్ పాల్గొన్నారు.

'ఆరోపణలు సరికాదు'

ఖానాపూర్: ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, టీచర్లు, హెల్పర్ల నుంచి డబ్బులు వసూళ్లు చేశారనే ఆరోపణలు సరికాదని (టీఎన్‌జీవోస్ అనుబంధ) అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సంపూర్ణ, జిల్లా ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. తమపై వస్తున్న నిరాధార ఆరోపణలపై కలెక్టర్, తహసీల్దార్, జిల్లా అధికారులకు 228 మంది టీచర్లు లిఖితపూర్వకంగా విన్నవించామని తెలిపారు. కేంద్రాల్లో జరిగే కార్యక్రమాలకు సంబంధించిన ఫ్లెక్సీల విషయమై చర్చించిన విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నారని పేర్కొన్నారు.

కోతకు గురైన రోడ్లు



కోతకు గురైన బెల్గాం రోడ్డు

- రెండేళ్లయినా మరమ్మతు ఏది?
- నిలిచిన రాకపోకలు
- ఇబ్బందుల్లో ప్రజలు

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల్లో గత రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు రోడ్లు కోతకు గురయ్యాయి. కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. దీంతో రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ పని నిమిత్తం ఆయా గ్రామాలకు వెళ్లాలంటే పడరాని పాట్లు పడుతున్నారు. అయినా మరమ్మతుపై అధికారులు తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. సిర్పెల్లితండాకు వెళ్లే రోడ్డు కొంత కోతకు గురికాగా, గతేడాది వరదనీటికి చాలా తెగిపోయింది. కుభీర్–భైంసా రోడ్డు గొడ్సర వద్ద తెగినా అధికారులు పట్టించుకోవడం లేదు. డొడర్నా సాయినగర్ తండా వద్ద కల్వర్టు వద్ద కోతకు గురైనా ఇప్పటికి మరమ్మతు చేపట్టలేదు. బెల్గాం గ్రామం వద్ద కల్వర్టు తెగిపోవడంతో ప్రమాదకరంగా మారింది. దార్‌కుభీర్ వద్ద కల్వర్టు కొట్టుకుపోయింది. గొడ్సర వద్ద, దార్‌కుభీర్, బెల్గాం గ్రామాల వద్ద తాత్కాలికగా మరమ్మతు చేపట్టారు. భారీవర్షాలు కురిస్తే కొట్టుకపోయే ప్రమాదం ఉంది. సిర్పెల్లి, సాయినగర్ తండా వద్ద మరమ్మతు చేయలేదు. ఇప్పటికైనా రోడ్లకు మరమ్మతు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కోతకు గురైన సిర్పెల్లి రోడ్డు

మరమ్మతు చేయండి



సిర్పెల్లితోపాటు గ్రామాల్లో కోతకు గురైన రోడ్లు, కల్వర్టులతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి మరమ్మతు చేపట్టాలి. పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జాదవ్ పండిత్ సిర్పెల్లి

నిధులు మంజూరు కాగానే..

గతేడాది గొడ్సర వద్ద తెగిపోయిన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు చేపట్టాం. ప్రభుత్వానికి పలుమార్లు నివేదికలు పంపించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతు చేపడుతాం.

– రఘు, ఆర్‌అండ్‌బీ ఏఈ, కుభీర్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సారంగపూర్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన ఇంటింటా పర్యటించి ప్రజలకు పారిశుధ్యంపై, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లఆవరణలో పాతటైర్లు, కుండీలు, ట్యాంకులు, డ్రమ్ములు, పారేసిన కొబ్బరి బొండాల్లో వర్షపు నీరు లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా దుకాణాలను తనిఖీ చేసి లైసెన్సులు తీసుకోని వారికి అవగాహన కల్పించారు. లైసెన్సులు తీసుకోవాలని చెప్పినా తీసుకోని వారికి నోటీసులు జారీ చేయాలని ఎంపీవో తిరుపతిరెడ్డికి సూచించారు. విభాగ పంచాయతీ అధికారి రమేశ్ ఉన్నారు.



పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్, తదితరులు

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికిగాను ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టులు బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా ఎం .సుధాకర్ ఓ ప్రకటనలో కోరారు. ఇంగ్లిష్, తెలుగు మీడియంలో రాజనీతి శాస్త్రం, కంప్యూటర్ సైన్స్, ఉర్దూ మీడియంలో ఉర్దూ, రాజనీతి శాస్త్రం, చరిత్ర, వృక్ష, జంతు, రసాయన శాస్త్రాలు బోధించేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులు అర్హులని(ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం), నెట్, సెట్, పీహెచ్‌డీతోపాటు బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. జూలై 4న సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని, 5న ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 99083 93217 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

భైంసా నృత్య శిక్షకురాలికి డాక్టరేట్



డాక్టరేట్ పురస్కారం అందుకుంటున్న సౌమ్య

భైంసాటౌన్: పట్టణంలోని శ్రీ నయనం నృత్య కళానిలయం శిక్షకురాలు రంగు సౌమ్య డాక్టరేట్ పట్టా అందుకున్నారు. కూచిపూడి నృత్య కళాసేవకుగాను సౌమ్య సేవలు గుర్తించిన కర్ణాటకకు చెందిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చి యూనివర్సిటీ ఆమెను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ఈ మేరకు శనివారం బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకుల చేతుల మీదుగా డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు. తనను గుర్తించి పురస్కారం అందించడం ఆనందంగా ఉందని సౌమ్య పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న మిత్ర బృందం

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద గ్రామానికి చెందిన పంచాయతీ పారిశుధ్య కార్మికుడు సాయిక్రిష్ణ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకు వైద్యఖర్చుల నిమిత్తం సాయిక్రిష్ణ మిత్ర బృందం, గ్రామ యువకులు రూ.లక్షా ఆరు వేల నగదును పోగు చేశారు. భార్య మౌనికకు శనివారం ఈ నగదు అందించారు. గ్రామస్తులు, యువకులు, సాయిక్రిష్ణ మిత్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రైతుభరోసాపై సమావేశం

కడెం: మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం రైతుభరోసాపై సమావేశం నిర్వహించారు. ఈ పథకంలో భాగంగా ఎన్ని ఎకరాలకు అమలు చేయాలి, తదితర అంశాలపై పలువురు రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్ రామడుగు శైలజ, సీఈవో రాజేందర్, ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.